


# వర్షీయసి

"అన్నేళ్ళు సేవచేసి మూలనున్న దేన్నో కొట్టేట్ట ... మరెవరూ దొరకలేదా? ... ఊరు గొడ్డు పోయిందా? ... ఏం చేసిందేం? ... దాన్నెందుకూ అక్కడ నిలబెట్టేరూ?"

"సూసైడు కేసు, సార్ ... మొన్నాదారం తీర్థం రాళ్ళకాడ ... నవ్వబోయి దీని తస్సాదియ్యా ... మమ్మల్ని నంపింది సార్ ... మా దుంప తెంపేసినాది"

"ఇదా! ... సూయిసైడా! ... వాట్!"

పాదిగే నేరాల బరువుకి ఒరిగిపోయే కాకులగూడు, పాపాల గర్భిణి, పాములపుట్ట, మసగవెలుగులో, మాయల ముసుగులో మంత్రగత్తెలలాంటి గబ్బిలాలు ఈదాడే దివ్వదివ్వమనే దెయ్యాలకొంప, వంటసారా మత్తు, వీథి తొత్తుల వెకిలినవ్వుల గమ్మత్తు. గుప్పు గుప్పుమనే అశ్రమంకొంగలు జపంచేసే మడుగు, అబద్ధాలు పండే సాక్షుల బోను. నోరులేని జీవాల పాపాలు పండే ముద్దాయిల బోను కోర్టు! మేజస్ట్రేటు కోర్టు!

లొంగని మృగాలన్నా, వంగని మనుషులన్నా (మృగప్రియుఁడు) ఎందుకేనా మంచిదని తన జాగ్రత్తలో తను ఉంటుంది సమాజం. గజాల ప్రహరీ కడుతుంది. నేరాలు మోపి కటకటాల బోనులో నిలబెడు తుంది. మహారాజశ్రీ మేజస్ట్రేటు కోర్టులో విరుగుడు చేసబోను గాలిలాంటి, నీడలాంటి ముద్దాయి కట కటాల వెనక మసక మసకగా కదులుతూంది.

అది లొంగని మృగంకాదు. వంగని మనిషికాదు. సొంపైన ఎం. పి. కాదు. సోఫియా లారెన్‌కాదు. సొసైటీ లేడీకాదు. స్టూడెంటు లేడీకాదు. ఎవరూ ఎరగని, ఎవరినీ ఆకర్షించలేని, ఎవరికీ అక్కర్లేని,

...రాపేరు చేసి ఆడగి. ... ఉండది.

ఆవిడ ఉంటున్న సుందర సముద్రతీరంలో ఎం ట్రస్టులమీద పడున్నా, పడున్నా గులాబీపువ్వు మొహానికి పూసుకోదు. సిలుకుగా నవ్వదు. గబ్బు కంపు కొడుతూ పిచ్చిదాన్లా ఉన్నా, రంభ, ఊర్వశి, పూసే పాటి 'స్మగ్లింగు పెర్ఫ్యూము' కొట్టుకొని ఎడతెగని ఓ పందిరి కుడితే.

షాంపూ అక్కర్లేదా, క్రీములూ, పిఫ్టులూ సంపర్కం లేనిదా పెరిగిన జుట్టు, సూనెముక్క లేక పండిపోయి, పీచుకట్టె సిక్కులొదిలిన సికులుబట్టలాంటి తల.

జేథింగ్ అక్కర్లేదు, వాసింగ్ లోషన్లు రుచిచూడని ఎండ దా చర్మం. ముడతలుగొట్టే మురికిబట్టలా ఉంది.

బెరిలాన్ పేర కట్టుకోలేదు. వెకిలాన్ బ్లౌజ్ వేసుకోలేదు. చిరిగే పేడు. అర్చుకుపోయిన, చిర్రుబుర్రుకుపోయిన సుండేదు. ఎవరో కట్టుకున్నని దేవతాసన్నిధిలా ఉంది. సూరాడు ముతకగుడ్డ. దానికన్నా కాసలాతోసే అవమానంలా ఉంది. చారిపాలని చిందిపోత.

ఆ కళ్లమీద రెపరెపలాడే తుమ్మెదరెక్కలు లేవు. ఆ కళ్లలో తళతళలాడే ఎసిడిమీనాలు లేవు. అవి పద్మ పత్రాలు కావు. అందులో ఒకేఒక వలపులుకావు. రేగేవి తియ్యని తలపులుకావు. బాధలు. అవమానాలు. అరిగి పోయిన గాజుగోళీలు. గుడ్డిరాళ్లు, వెలుగులేని గాజుకళ్లు.

పీచుపీచుమని ముక్కులోంచి వచ్చేపోయే జీవం. కంటిచివర వేలాడే ప్రాణం. బ్రతుకులో ఓడిపోయి, వయసులో వాడిపోయి, నిలవ శక్తి లేక గడగడలాడిపోయే పీనుగు. గలగలలాడి ఇకిలించే ఎముకలగూడు.

జంబూద్వీపంలో, భరతవర్షంలో, భరతఖండంలో ఏ మూల చూసినా కనబడే సామాన్య దృశ్యం. బక్కచిక్కిన ముసిలిది. దిక్కుమాలిన ముసిలిది. సమాజం కన్నెర్రజేస్తే ముద్దాయిగా బోనులో విలవిల తన్ను కుంటూంది. "ఈ ముసల్దా! . . . ఆత్మహత్య చేసుకోబోయిందా! ఆశ్చర్యంగా ఉందే!" అనుకుంటూ నిగనిగలాడుతున్న బట్టతల తడుముకున్నారు మేజ స్ట్రేటుగారు. పూర్తిగా మొద్దుబారక ఇవ్వుడిప్పుడే ముదురుతున్న లేతమోహం చూస్తే వయసు మీద కుండానే ఉన్న కాస్త జుత్తూ రాలిపోయినట్టనిపిస్తుంది. స్కైలావచ్చినులో లేరు మేజస్ట్రేటుగారు. నున్నగా, బొద్దుగా గుటకలువేస్తూ, కళ్లు మిటకరిస్తూ డబ్బులు మింగే బొమ్మలా ఉన్నారు. చిట్లించిన నుదురు అరచేతితో దాచుకుని ఆలోచిస్తున్నారు. పడి లేచిన సంసారిలా జాలిగా, బరువుగా చూస్తున్నారు.

"ఈ ముసల్దేమిటి . . . ఈ కేసేమిటి? . . . ఏదో వెధవ పీటూరీలా మీరూను ... కొట్టిపారేస్తాను." కాండ్రుమంటూ పోలీసువాళ్లవేపు తిరిగేరు మేజ స్ట్రేటు.

కొయ్యబారి బిగుసుకుపోయేడు హెడ్‌కానిస్టేబులు. కుడికాలు ఎడంకాలు దగ్గిరకి 'టప్'మని లాగి వణికిపోయే కుడిచేత్తో సెల్యూటు చేస్తూ, "తమరలా అనేస్తే ఎలాగ సార్ ... దీని తస్సలవనలా . . . ఇలా ఉండనా. . . అమ్మోరి నాయినో. . సవండరంకాడ అరబ్బీగుర్రంలాగ మూడుకాళ్లమీన డేన్సాడేసి ముప్పతిప్పలు పెట్టేసింది సార్. జాసుకొచ్చేసరికి...మా తాతల్దిగొచ్చేరు" అన్నాడు.

"ఆహా! ముసలిగుర్రాలుకూడా డాన్సాడతా . . . ప్రాణాలు, ప్రాణాలుతీసేక, బ్రతకలేక ప్రాణాలు తీసుకోదలిస్తే ఆత్మహత్య అవుతుంది. అది నేరం. ఆ నేరం విచారణకని, ఆ ముద్దాయిని కోర్టుకు లాగితే, విచారణ ముగిసేలోగా ఆ ముద్దాయి ప్రాణాలు హరీమంటే అది హత్య అవుతుందా! ఆత్మహత్య అవుతుందా! ధర్మశాస్త్రం, న్యాయ శాస్త్రం ఏం చెబుతుంది?

తస్సదియ్యా! ... లాక్కొచ్చి ... దూలాలు, ముసలిదాన్ని... నువ్వు ఆత్మహత్య చేసుకోబోయేవట . . . నిజమేనా?" అని పోలీసువాళ్లని అదమాయించి ముద్దాయివేపు తిరిగి సౌమ్యంగా అడిగేరు మేజిస్ట్రేటు.

"తవుఁ రేటడుగుతుండరో తెలీదు, బాబూ . . . ముసిలిముండని" అంది ముద్దాయి.

"అదే . . . నువ్వు మొన్న ఆదివారంనాడు తీర్థపు రాళ్లదగ్గిర సముద్రంలో పడి బలవంతంగా చావబోయే వంటున్నారు పోలీసువారు . . . ఏమంటావు?"

"ఏద్దుబాబు సొప్పింది విజవేఁమా బాబో ... నేనే సచ్చబోయేను, బాబూ . . . నన్నెవరూ బలవంతం సెయ్యలేదు."

"చావబోడం నిజమేనన్నమాట!"

"నిజమే, తండ్రీ."

"అంత కష్టం ఏమొచ్చింది, ముసలమ్మా ... ఎందుకంత పని చేసేవు? బలవంతంగా ప్రాణం తీసుకోడం నేరమని నీకు తెలీదా?"

"నేరవా! . . . ఇదేటి, బాబూ. . . దొంగతనం సేసేనా, రంకుతనం సేసేనా? ... ఒవ్వు లుసురేనా ఓసుకున్నానా? . . . బతకలేక సద్దావనుకున్నాను... నేరవంటన్నరు . . . ఏం జేసినాను, బాబూ?"

"బలవంతంగా ప్రాణాలు తీసుకోబోవడం నేరం, ముసలమ్మా . . . చాలా పెద్దనేరం చేసేవు."

"నువ్వకేటి సెయ్యను, బాబూ.. గత్యంతరం నేదు" అని ఉస్సురంది ముసిలిది.

"ఏం?" అన్నారు ఆత్రంగా మేజిస్ట్రేటు.

"కట్టుకున్న రాజెప్పుడో బుగ్గైపోనాడు ... కన్న కొడుకంటారా? ... ఆడికి మందెట్టి ఓసావాలెదవలో తోసిపోనాది కోడలుముండ . . . అది కోడలా, బాబూ ... హమ్మో ... సువ్వునాతిరండ ... అందర్నీ మింగేసి ... అందరుసురూ పోసుకొని ఇన్నేల్లూ పావలకాకిలా బతికినాను ... ఇంకీదలేను, బాబూ . . . ఏటుందని బతకను? ఏటి సూసుకుని బతకను? ... కడుపులో నెప్పి లేసింది . . . అది గుండికాయిని గునపాల్తో పెల్లగించేస్తది, బాబూ . . . నడుం జారిపోనాది ... కల్లు సదవు...మాయిదారి లోగం దొల్సుకు తినేస్తంది... ఇరుగుపొరుగో లెంతకాలం సూత్తారు, నాన్నా, ... ఈ మహాపట్నంలో ఏ పంచ కాలీగుంది సొప్పు బాబూ... ఆకలితో సచ్చి రోగంతో కుల్లిపోయి...అందరికీ బరువై పోయి బగుమంతుడికి దూరవైపోయి ... ఎందుకీ బరుకు? ... నవ్వ కేటి సెయ్యమంటవు, నాయినా?... కూడునేక, గుక్కెడు గెంజినేక గజీగజికి సచ్చేబదులు ఒక్కసారే గంగమ్మతల్లి కడుపులో కలిసిపోతే సిక్కులు తీరిపోతయ్యని సవందరంలో పడి సద్దావనుకున్నాను. పేదోళ్లు సావడానికీ యీల్లేదా, బాబూ! . . . నే సస్తే బూదేవతకేం లోటా? సస్తే కొంత బరువు తగ్గద్ది . . . బతుకుదాఁ వనుకుంటే యీగరబెట్టి సంపేసినారు ... సద్దాఁ వంటే నేరం నేరఁ వంటూ యీడ్సుకొచ్చేరు...ఏటి మడుసులు! నేనేం సేసేనని, బాబూ, యీలా ఇంసలు ఎట్టేస్తన్నరు? . . . సావనా బతకనా, నాయినా?...ఏం సెయ్యమంటావు, బాబూ?" అని ముసలమ్మ హృదయవిదారకంగా ఏడుస్తూ, మేజిస్ట్రేటువేపు చూసి రెండుచేతులూఎత్తి మొక్కింది.

వణికిపోతూ, ఆయాసపడిపోతూ దుఃఖం, బాధ, ఆవేదనా, అక్కసూ అన్నీ కలగాపులగంచేస్తూ తన గోల వెళ్లబోసుకుంది ముసలమ్మ. ఓపికలేక కటకటాలమీద ఒరిగిపోయింది.

మేకులు తాపిన పేస్ట్రకీస్తులా కుర్చీకి చేరబడి పోయేరు మేజిస్ట్రేటు. ముసలమ్మ కథ మోయలేని సిలువై కూర్చుంది. ఆయన కళ్లు భూమ్యాకాశాల మధ్య కిందకీ మీదకీ తెగసాగుతున్నాయి. ఎవరో చెప్పుపోటు పాడిచినట్టు చటాలున ముందుకి వంగి, "నిజమే . . . ఈ ముసలమ్మేం నేరం చేసింది?" అన్నారు ఏదో పనిమీద వచ్చి వెళ్లిపోతున్న పబ్లిక్ ప్రాసిక్యూటరుగారివేపు చూస్తూ.

"ఆత్మహత్యాప్రయత్నం" అన్నారు యాంత్రికంగా హఠాత్తుగా ఆగిపోయిన ప్రాసిక్యూటర్‌గారు.

"సిల్లీ" అన్నారు మేజిస్ట్రేటుగారు.

"ఇన్ హ్యూమన్... అమానుషం" అన్నారు అక్కడే కూర్చుని పిలవబోయే కేసు ఫైలు చూసుకుంటున్న వయసుమళ్లిన వకీలుగారొకరు.

"ఏం!?" అని ఆశ్చర్యపోతూ వెనక్కి తిరిగివచ్చి లాయర్లు కూర్చునే బల్లదగ్గిరకి వచ్చి నిల్చున్నారు పబ్లిక్ ప్రాసిక్యూటరు.

"ఇంత ఆశ్చర్యపోతారెందుకండీ? ... చచ్చినవాళ్ల జోలికి వెళ్లలేదుకదా న్యాయశాస్త్రం . . . అంటే ... తన్ను తాను చంపుకోడం నేరంకాదు ... బలవంతాన చావబోడం . . అంటే ప్రయత్నం చెయ్యడం నేరం ... ఆత్మహత్య సక్రమంగా జరిగిపోతే మీరేం చెయ్యలేరు ... పీనల్ కోడ్‌లో అది నేరంకాదు . . . ప్రయత్నం మధ్యలో బెడిసి హత్య పూర్తికాకపోతే నేరం చేసేవంటూ పొక్క చీరేస్తాం అంటున్నారు ... మనిషి చేతగాని తనాన్ని శిక్షించడం సిల్లీగా లేదూ? . . . మనిషి ఓటమి న్యాయశాస్త్ర విజయానికి పునాదికావడం ఫన్నీగా లేదూ?!" అంటూ కూర్చున్న సింహాసనంమీద నల్లులు అల్లరిపెడితే గంగవెర్రులెత్తిపోయే మలిస్తీమితం లేని మహారాజులాగ బెంచిమీద ఇటూ అటూ ఊగిపోయి పిడుగుపడినట్టు నవ్వేరు మేజిస్ట్రేటుగారు.

"తమరు క్షమిస్తానంటే . . ." అంటూ ఏదో చెప్పబోయి లేచి నిల్చున్నారు వయసుమళ్లిన వకీలు గారు, జరీపాగా సరిజేసుకుంటూ, జారిపోతున్న గౌను సద్దుకుంటూ.

"చెప్పండి, చెప్పండి. పెద్దవారు ...మీ వ్యాఖ్యానం

ఎం. రామకోటి

కూడా విందాం" అన్నారు మేజిస్ట్రేటు.

"ముసలమ్మ చేసింది నేరంవా?" అన్నారు వకీలుగారు.

"కాదా? . . . బలవంతంగా చావబోవడం నేరం కాదా?" అన్నారు ప్రాసిక్యూటరు.

"ఎవరి ప్రాణాలు వారు తీసుకుంటారు . . . అది వాళ్ళిష్టం ... మరొకరి ప్రాణం జోలికి పోనంతకాలం ... మధ్య మీకెందుకండీ? ... ప్రభుత్వానికేం ప్రమేయం ఉందందులో?"

"ఎందుకు లేదూ? . . .ఆదిలో ఈ నేరం మత సంబంధమైనది ... తన సర్వశక్తులూ వినియోగించి మనిషిని సృష్టించి ప్రాణంపోసి జీవించమన్నాడు భగవంతుడు. ఆ ప్రాణాన్ని గడ్డిపోచలా తీసిపారేసి చావడం దైవానికి అపచారం ... దైవానికి జరిగిన అవమానం సమాజం సహించదు. దాన్ని నేరంకింద పరిగణించింది... ఆ సమాజం స్థాపించిన ప్రభుత్వం నేరస్తులెవరైనా సరే శిక్షిస్తుంది.

"మనది సెక్యులర్ స్టేటంటున్నారు ... భగవంతుడంటే పీడకలగా భయపడుతున్న సాంఘిక వ్యవస్థలో భగవంతుడికి అపచారం జరిగిపోయిందంటూ ఆయన పేరుతో మనుష్యుల్ని శిక్షించడం హాస్యాస్పదం కాదా?... ఈ వ్యవహారం మనం అమలుజరుపుకుంటున్న రాజ్యాంగానికీ, మనం జీవిస్తున్న సామాజిక వ్యవస్థకీ విరుద్ధం కాదా?" అంటూ వెటకారంగా దొంగదగ్గు దగ్గేరు వకీలుగారు.

వాదం ఈ ధోరణిలో పడుతుందని ఊహించని ప్రాసిక్యూటరుగారు ఒక్క క్షణం బిత్తరపోయేరు.

"మొదట్లో ఈ నేరం స్వరూపం అలా ఉండేదన్నాను... మతాధికారుల ప్రమేయం సన్నగిల్లింతరవాత దాన్ని సాంఘిక నేరంకింద పరిగణించింది సమాజం ... ప్రతిమనిషీ సంఘానికి అవసరం...బతికున్నంతకాలం సమాజాభ్యున్నతికి ప్రతి మనిషీ చాకిరీ చెయ్యాలి . . . సమాజం దృష్టిలో మనిషి ప్రాణం చాలా విలువైనది... దానికి హాని ఎవరివల్ల జరిగినా సహించదు. అందుచేత ఆత్మహత్య నేరంగా పరిగణించింది సమాజం" అన్నారు ప్రాసిక్యూటరు వాదనని మరోదారి పట్టిస్తూ.

"అలా దారికి రండి, ప్రాసిక్యూటరుగారూ .. బతుకంటే గుప్పెడు ప్రాణి పిచ్చుకకీవా బ్రహ్మాండంగా ఉంటుంది ... తినడానికి నాలుగు గింజలు దొరికినంతకాలం నీలాకాశం నీడలో పచ్చటి లోకంలో వెంగుచెంగుమని గెంతుకుంటూ పదికాలాలపాటు బతుకుందామనుకుంటుంది ... సాగితే బ్రతకాల నెవరి కుండదు చెప్పండి? . . . పిచ్చుకకి స్వర్గంలా, నందన వనంలా, బృందావనంలా కనిపించే ఈ లోకం ముసలమ్మకెందుకు నరకంలా కనిపించిందో ఊహించేరా? ... 'ఈ లోకం మాయ, ఈ సంసారం మురికికూపం, ఈ దేహంమండి ఎంత వేగం తప్పుకుంటే అంత మంచిది' అని మోక్షచింతనలో పడి చావబోయిందనుకోడానికి యీ ముసలమ్మ తత్త్వవేత్త కాదు ... వేదాంతికాదు ... గిల్లితే మొర్రోమనే మనిషి . . . ఆకలి, దాహం, రోగం, రొష్టూ, కష్టం, సుఖం, ప్రేమ, అనురాగం, అమాయ, ద్వేషం — ఇవన్నీ మనమీద దండెత్తినట్టే ఆవిడమీదా దాడిచేసిఉంటాయి ... అయినా మనం చచ్చిపోదాం వనుకోలేదు. ఆవిడ అనుకుంది ... ఎందువల్లో ఆలోచించేరా? ... కష్టాల్లో సహచరులుండడం లోకంలో మానవుడికి ఒక వరం అన్నాడు సెర్వాంటెజ్. అవస్థల్లో మగ్గిపోయిన ప్రాణికి సానుభూతి అమృతం లాంటిది ... ఆ సానుభూతి ... ఆ చేయూత ... ఆ తోడునీడ కరువైతే బ్రతుకు దుర్భరం వైపోతుంది ... ఆ సానుభూతి కరువైపోయింది ముసలమ్మకి ... బ్రతకాలన్న కోరిక పుట్టుకతో అంకురిస్తుంది ... చావాలన్న కోరిక మధ్యలో జొరబడుతుంది . . . ముసలమ్మ ప్రాణం సమాజానికి విలువైందంటున్నారు. ఆ ప్రాణం ముసలమ్మ తీసుకోకూడదని హుకుం జారీచేస్తున్నారు ... ఆ ప్రాణం నిలబడడానికి తగిన పోషణ కల్పించలేని సమాజానికి దాన్ని తీసుకోడానికి వీల్లేదని ఆంక్ష విధించే హక్కు ఎక్కడిది? ... కడుపునొప్పితో కిరకిరలాడిపోతున్న ముసలమ్మకి సమాజం మందునీళ్ళు పోసిందా? ఆకలితో అల్లాడిపోయే ముసలమ్మకి ఈ ప్రభుత్వం గుక్కెడు గంజి పోసిందా? ... తాగ గంజి లేక, నిలవ నీడలేక . . . ఆదరణలేక ... చీదరించుకునే లోకంలో ముసలమ్మ ఎలా బ్రతుకుతుంది? ... ఏం చూసుకుని బ్రతుకుతుంది? . . . ఎందుకు బ్రతకాలి? మీ సమాజంలో అవిటివాళ్ళ ఇన్స్యూరెన్సులున్నాయా? . . . పేదవాళ్ళకి పూర్ హోమ్స్ ఉన్నాయా? ముసిలివాళ్ళకీ, అనాథలకీ పెన్షన్లున్నాయా? . . . ఏం చూపించి ముసలమ్మ చావడం నేరం అంటుంది సమాజం?...సమాజానికి హక్కులేగాని బాధ్యతల్లేవా?... ఇంత భయంకరంగా లోకాన్ని తయారుచేసి ముసలమ్మ చావకూడదని శాసించడం అమానుషం కాదా? ... రాక్షసం కాదా?" అని వీరావేశంలో ఆర్గ్యుమెంటు చెప్పేరు వకీలుగారు.

> కృషి నుంచి ఆరోగ్యం, ఆరోగ్యంనుంచి సంతుష్టి ఉత్పన్నమౌతాయి.
>
> —బీట్టి

ఈ వాదప్రతివాదాల దుమారంలో ఓపికలేక సొమ్మసిల్లిపోయింది బోనులో ముసలిది.

"ధర్మపన్నాలు వల్లించేరు మా లెర్నెడ్ ఫ్రెండ్ ... ఆత్మహత్యాప్రయత్నం న్యాయశాస్త్రప్రకారం నేరం . . . అది ఆయనకీ తెలుసు . . . న్యాయశాస్త్రంలోఉన్న లొసుగుల్ని వేలెత్తి చూపిస్తున్నారు" అన్నారు తొణుకూ బెణుకూ లేకుండా మెల్లిగా ప్రాసిక్యూటరు.

"ధర్మం . . . భగవంతుడు — ఈ పదాలు భాషలో అర్థంలేని చప్పుళ్ళుగా మారిపోయేయి . . . ఏ న్యాయమేనా, ఏ శాస్త్రమేనా మానవతకి భంగకరంగా ఉండకూడదు...అమానుషంగా తయారుకాకూడదు ... మన పీనల్ కోడ్ రచించిన బ్రిటిష్‌వారు ఇప్పుడు ఆత్మహత్యాప్రయత్నం నేరంకింద చూడడం మానుకున్నారు ... నేరాల జాబితాలోంచి దాన్ని తొలగించేరు ... ఆ విషయం ప్రాసిక్యూటరుగారికి తెలియందికాదు" అని బొద్దుమీసాలు పెదాలమీదనుండి విగదువ్వుకుంటూ చిన్న నవ్వు నవ్వేరు వకీలుగారు.

"ఐ సీ! ... బ్రిటన్‌లో నేరంకానిది మన దేశంలో నేరం వెలా అవుతుందీ?...మనుషులు వేరా? ఆలోచనలు వేరా?మనిషికో న్యాయమూ, దేశానికో శాస్త్రమూనా? . . . అందుకే 'రా' అంటే గాడిదన్నారు" అన్నారు కొంచెం ఎత్తిపొడుస్తూ మెజిస్ట్రేటు.

"నిజమే మరి . . . దాన్ని కాసేవాళ్ళకి కాస్త తెలివంటూవుంటే తాపులు తినే ప్రమాదం ఉండదు" అన్నారు ప్రాసిక్యూటరు వ్యంగ్యధోరణిలో.

"మనమంతా కాస్తున్నాం దాన్ని . . . ఫరవాలేదు లెండి . . . దానికేంగాని . . . మన దేశంలో ఈ నేరాన్ని ఇంకా ఎందుకు ఎబాలిష్ చెయ్యలేదు?" అని కొంచెం ఉడుక్కున్నారు మేజిస్ట్రేటు.


"ఈ దేశంలో మనిషి ప్రాణాని కింకా విలవుంది గనక..."

"ఓహోహో! ఏం విలవుందండీ ... మనిషి ప్రాణం వంటే ఎంత విలవుందీ! ... ఆకలితో మాడి చచ్చినా ... చస్తే చావండికాని సహజంగా చావండి. కుళ్ళి కుళ్ళి చావండి ... అంతేగాని బలవంతంగామాత్రం చావకండి అంటుంది ప్రభుత్వం ... అంతేనా? . . . బాగుందండీ మీ వాదం" అని వెక్కిరించేరు మేజిస్ట్రేటు.

"అడిగేరు కదా అని లా చెప్పేను ... నేను ప్రభుత్వం తరఫున కేసు నడిపించడంలేదు ... న్యాయశాస్త్రంలో మూలతత్త్వం విడమర్చి చెప్పేను ... కేసుతో నాకేం సంబంధంలేదు ... మీ ఇష్టం" అని వెళ్ళిపోయేరు ప్రాసిక్యూటరు.

"నాకు సంబంధం ఉంది" అని గంభీరంగా మారిపోయేరు మేజిస్ట్రేటు.


'ఏం నేరం చేసిందని శిక్షించడం? శిక్ష వేస్తే డెబ్బైఏళ్ళ ముసిల్ది జైల్లో మగ్గిపోతుంది. తన ఇష్టం వచ్చినట్టు మసిలే స్వేచ్ఛకూడా కోల్పోతుంది. జైలు గోడలమధ్య శవంలా పడుండాలి. జైలు అధికారుల ఇళ్ళల్లో అంట్లు తోమాలి. చాకిరీ చెయ్యాలి. మనిషికి ఒకే ఒక్క వరం స్వేచ్ఛ. అదికూడా కరువైపోతుంది. శిక్షించి జైలుకు పంపడం అమానుషం కాదా? సమాజానికి సానుభూతి లేదు. ప్రభుత్వానికి జాలీ, కనికరం లేవు. వదిలేస్తే ముసలమ్మ నెవరు చూస్తారు? గంజెవరు పోస్తారు? అయ్యో అని ఎవరాదరిస్తారు? నీడపట్టుకు ఎవరు రమ్మంటారు? ఏ పంచ చోటిస్తుంది? కడుపునొప్పితో చుట్టుకుపోతే మందు నీళ్ళెవరు పోస్తారు? ఈ దేశంలో పేదవాళ్ళ ఔషధం గంగాజలం. వైద్యుడు నారాయణోహరిః. దిక్కూ మొక్కూలేక కాటికి కాళ్ళుజాచిన ముసలమ్మని కోరలు చాచి వికటాట్టహాసంచేసే సమాజంలోకి మళ్ళీ తొయ్యడమా? నిప్పులు రాల్చే లోకంలోకి తోలెయ్యడమా? . . . గాలికీ ధూళికీ వదిలెయ్యడమా? భరించలేక, బ్రతుకులేక మళ్ళీ ముసలమ్మ చావబోతే?... పోలీసులూ, కోర్టులూ, జైళ్ళూ . . . బాబోయ్! ముసలమ్మని వదిలెయ్యడం అమానుషం . . . మాంచి ధర్మసంకటంలో పడ్డానయ్యా దేవుడా . . . ఆరెరే! దేవుడెవడయ్యా మధ్యని . . . సెక్యులర్‌స్టేటులో ఇతగాడు ఒడ్డునపడ్డ చేపలా గింజాకుంటున్నాడు . . . సమాజం వెలివేసిన నేరస్థుడు. . . నేరస్థులకి న్యాయస్థానాల్లో గౌరవం ఉండదు . . . అయితే ముసలమ్మని జైలుకి పంపడమా? . . . విచ్చలవిడిగా వదిలెయ్యడమా? మై గాడ్! దటీజ్ ది క్వశ్చన్ . . . అదిగో మళ్ళీ గాడ్ . . . దేవుడూ దెయ్యం . . . ఇబ్బందిపెట్టి అంతఃకరణలాగ తనూ ఉన్నానంటూ మధ్యకొస్తాడు.




మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!
DOL-327 TEL

ఎక్లేర్ స్నో

సాటిలేని నూతన సౌందర్యమును చేకూర్చుటకు ఎన్నికైన ఎక్లే స్నో మీ మృదువైన చర్మాన్ని సౌందర్య వరచుటకును, మృదుత్వాన్ని కాపాడుటకును శాస్త్రోక్తంగా తయారుచేయ బడినది. దీనిని ఎల్లప్పుడు వాడితే ఇది మీ శరీరాన్ని అతి సౌందర్యంగా తయారు చేస్తుంది. దీనిని ఈ రోజు నుండే వాడి నవలావణ్యాన్ని పొందండి.




ఉత్పత్తిదార్లు :
నోవా కంపెనీ, ఆగ్రా రోడ్డు, భండుప్, బొంబాయి-78

No. 2

అసలీ గందరగోళమంతా ఇతగాడివల్ల వచ్చింది కాదూ? ఇన్ని తప్పులతడకలతో, ఇన్ని అవకతవకలతో ఈ సృష్టెందుకు చెయ్యాలి? . . . ఈ ప్రాణాల్ని ఇన్ని ముప్పతిప్ప లెందుకు పెట్టాలి? సృష్టివథకంలోనే ఉంది లోపం దేవుడు గొప్పకవిట. . . అతడి సృష్టి వర్క్ ఆఫ్ ఆర్టు అంటారు. . . నాన్సెన్స్ . . ఆయనగారి కవిత్వం బెడిసికొట్టింది . . . ఆ దెబ్బ మనుమల్ని తిప్పి కొట్టింది. . . ఈ సృష్టి . . . ఈ క్రియేషను . . . దేవుడు, న్యాయం, ధర్మం. . . రబ్బిష్! . . . అభిప్రాయాలెలాఉన్నా ముసలమ్మ న్యాయశాస్త్ర ప్రకారం నేరం చేసింది. ముసలమ్మే స్వయంగా ఒప్పుకుంది. సమస్య శాస్త్రప్రకారం పరిష్కరించాలి. అబ్సొల్యూట్ . . . అదేంతసేపు? . . . నేరం చేసిందని తీర్పు చెబుదాం. శిక్షించడం మానేదాం' అని లోలోపల తల్లడిల్లిపోయి, "ముసలమ్మా, నువ్వు నేరం చేసేవని నమ్ముతున్నాను. ఆడదానివని, వయసుమళ్లిపోయిందానివని ఇంతకుముందు నువ్వేనేరం చెయ్యలేదని అన్ని విషయాలూ ఆలోచించి నిన్ను విడుదల చేస్తున్నాను. . . ఈ ఊళ్లో అనాథశరణాలయంలో చేర్చుకోమని వారికి ఉత్తరం రాస్తున్నాను . . . వెళిపో, ముసలమ్మా. .నిన్ను విడుదల చేసేను. . . వెళ్లిపో" అని తీర్పు చెప్పేరు మేజస్ట్రేటుగారు.

బోనులో కటకటాలు పట్టుకుని కూర్చున్న ముసలమ్మ మెదలలేదు.

"వెళ్లిపో, ముసలమ్మా" అని మళ్లీ హెచ్చరించేరు

"లెగులెగేహె, ముసిలీ ... వదిలంగా కూకుదుంది ... లెగమంటే" అని కోర్టుబంట్రోతు ముసలమ్మని లేవదీయబోయేడు.

కటకటాలు వదిలి నేలమీద వడిపోయింది ముసలమ్మ. అక్కడే ఉన్న హెడ్‌కానిస్టేబుల్ ఆత్రతగా పరిగెత్తుకువెళ్లేడు.

"దీని తస్సాదియ్యా! కునికేసింది, సార్" అని టోపీ తీసి చేత్తో పట్టుకున్నాడు.

"ఆఁ! . . ." అని నిర్ఘాంతపోయేరు మేజస్ట్రేటు గారు.

"చావబోయిందని నేరం మోపి విచారణ చేసేం. . . చంపేం. . . ఇది ఆత్మహత్యా? హత్యా?!. . . మై గాడ్, మై గాడ్! నేరం చేసేను. . . హత్య. . . ఖూనీ. . ." అంటూ పిచ్చికేకలేసుకుంటూ, నవ్వుతూ, ఏడుస్తూ, పలవరిస్తూ, కళ్లు ఒత్తుకుంటూ, మొహం తుడుచుకుంటూ, బెంచి దిగిపోయి వరండామీద జారిపోతున్న గౌను ఈడ్చుకుంటూ ఛాంబర్సులోకి పారిపోయేరు.

కోర్టు ఆవరణలో చెట్టుకింద పడుకోబెట్టేరు ముసలమ్మని. వీథిలో సరసం చెయ్యబోయి దొరికిపోయిన ఒక వడుపుగత్తె తిని పారేసిన ఎంగిలాకు ఎగిరివచ్చి ముసలమ్మ మొహానికి ఎండ తగలకుండా గొడుగు పట్టబోయింది. పక్కనున్న గజ్జికుక్క అదను చూసి గబుక్కున మీదకురికి పంట కరుచుకు పారిపోయింది. ముసలమ్మకి ఎండ లేదు. వాన లేదు. మానం లేదు. అవమానంలేదు. ఆకలిలేదు. దాహంలేదు. ముసలమ్మతో సమాజానికింకేం పనిలేదు. న్యాయం, ధర్మం, నేరం, శిక్ష, కోర్టులూ, సమాజాలూ, ప్రభుత్వాలూ ముసలమ్మ జోలికి పోలేవు. వాటి హయాం దాటి పోయింది. బ్రతికిఉన్నంతకాలం ముసిల్ది సమాజానికి ఒక సమస్య. చచ్చింతరవాత పీడ కల! ★